క్లుప్తంగా

లేగదూడలకు నట్టల నివారణ మందులు



దూడలకు నట్టల నివారణ మందులు వేస్తున్న పశువైద్యాధికారి

మద్దికెర: మండల పరిధిలోని బొజ్జనాయునిపేట గ్రామంలో శుక్రవారం లేగ దూడలకు పశు వైద్యాధికారి కృష్ణానాయక్ నట్టల నివారణ మందులు వేశారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులు దూడల సంరక్షణపై దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే మూడు, నాలుగు నెలల వయసులోనే దూడలు మరణిస్తాయని, తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు.

పరిహారం చెక్కులు పంపిణీ

తుగ్గలి : రైల్వే డబుల్ లైన్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు శుక్రవారం పత్తికొండ ఆర్డీవో మోహన్‌దాస్ పరిహారం చెక్కులు అందజేశారు. తుగ్గలి-గుంతకల్లు మధ్య రైల్వే డబుల్ లైన్ నిర్మాణం కోసం తుగ్గలి 21 మందికి రైతులకు చెందిన 5.96ఎకరాలు సేకరించారు. దీంతో ప్రభుత్వం ఎకరా రూ.10లక్షల చొప్పున పరిహారం మంజూరు చేసింది. ఈ మేరకు భూములు కోల్పోయిన రైతులకు ఆర్డీవో పరిహారం చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీటీ నిజాముద్దీన్, వీఆర్వో రహిమాన్ పాల్గొన్నారు.

పంట రుణాలు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలి

తుగ్గలి : రైతులు బ్యాంకులో తీసుకున్న పంట రుణాలకు సంబంధించి సకాలంలో రెన్యువల్ చేసుకుంటేనే వడ్డీ రాయితీ వర్తిస్తుందని జొన్నగిరి, తుగ్గలి ఏపీజీబీ మేనేజర్లు కేసీ లోకేష్, శ్రీలత తెలిపారు. ఆయా బ్యాంకుల పరిధిలోని గ్రామాలకు సంబంధించి రైతుల పంట రుణాల రెన్యువల్ తేదీలను శుక్రవారం ప్రకటించారు. జొన్నగిరి బ్యాంకు పరిధిలో శనివారం నుంచి, తుగ్గలి బ్యాంకు పరిధిలో మేనెల 5వతేదీ నుంచి పంట రుణాలు రెన్యువల్ చేస్తున్నట్లు వారు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. .

నేడు వాహనాల వేలంపాట

హొళగుంద: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం స్టేషన్ ఆవరణలో వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ వల్లెపు శ్రీనివాసులు తెలిపారు. బైకులు, ఆటో, కారుతో కలిపి మొత్తం 27 వాహనాలను బహిరంగ వేలం వేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వాళ్ల ఆధార్‌కార్డు జిరాక్స్‌తో వేలంలో పాల్గొనాలని సూచించారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న కొమ్ము దీపిక, నాగరత్నమ్మ

పత్తికొండ రూరల్: స్థానిక కుమ్మరివీధిలో గురువారం సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ కొమ్ము దీపిక,గౌరవ సలహాదారు నాగరత్నమ్మ భూమి పూజచేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టిసారించామని, చాలా చోట్ల కాలువల నిర్మాణం, పైపులైన్ పనులు చేయిస్తున్నామన్నారు. ఉపసర్పంచు కళావతి, వార్డు సభ్యుడు భాష, బండిమస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

మద్దికెర: వేసవి నేపథ్యంలో భూగర్భజలాలు తగ్గిపోవడంతో నీటి పథకాలు మందగించాయని, అయితే చింతకుంట నీటిపథకంతో నీటిని సరఫరా చేసి సమస్య పరిష్కరించేందుకు అన్ని చర్యలు చేపట్టామని ఈఓ శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మద్దికెరలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సుహాసిని అధ్యక్షతన పంచాయతీ సభ్యుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామంలోని గిడ్డయ్య వీధిలో నీటిసమస్య నెలకొందని కాలనీవాసులు అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ చిప్పగిరి రిజర్వాయర్ నుంచి నీటిని సరఫరా చేసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పంచాయతీ సలహాదారు ఆంజనేయులు, ఉపసర్పంచు ప్రమీలమ్మ, సభ్యులు కిట్టి, వరప్రసాద్, లక్ష్మీనారాయణ, రామాంజులు, రవి పాల్గొన్నారు.

ధర్మ మార్గంలో నడవాలి

గోనెగండ్ల: ప్రతి ఒక్కరూ ధర్మ మార్గంలో నడవాలని తిరుమల తిరుపతి దేవస్థాన హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అలువాల గ్రామంలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ధార్మిక, అధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ, కుంకుమార్చన చేపట్టారు. భారతీయ సనాతన ధర్మం యొక్క విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఆర్ వెంకట్రామిరెడ్డి, భజన మండలి అధ్యక్షుడు మురహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి 'బాట'లు

- రూ.2.56 కోట్లతో ఆలూరు-హొళగుంద రోడ్డు నిర్మాణం
- 70 శాతం పూర్తయిన బీటీ రోడ్డు పనులు
- నియోజకవర్గంలో మార్కెట్ యార్డ్ నిధులతో మంజూరైన 15 రోడ్లు
- పురోగతిలో రోడ్డు నిర్మాణ పనులు

నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామాల రోడ్లు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధికి పెద్దపీట వేశారు. రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఫలితంగా నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామాల రోడ్లు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి. గతంలో ఏ గ్రామానికి వెళ్లినా గుంతలు తేలిన రోడ్లు కనపడేవి. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేయలేని అభివృద్ధిని మూడేళ్లలో చేసి చూపుతున్నారు. కొత్తగా నిర్మిస్తున్న రహదారులతో ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. – ఆలూరు రూరల్



నాడు గుంతలు పడి అధ్వాన్నంగా ఉన్న ఆలూరు-హొళగుంద బీటీ రోడ్డు



నేడు నూతనంగా నిర్మించిన ఆలూరు-హొళగుంద రహదారి



ముద్దనగేరి సమీపంలో బీటీ రోడ్డు పనులు పర్యవేక్షిస్తున్న పీఆర్ అధికారులు

నియోజకవర్గంలోని 5 మండలాల్లోని మార్కెట్ యార్డు నుంచి 15 రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.7.78 కోట్లతో పనులు జరుగుతున్నాయి. మరిన్ని నిధుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపారు. తర్వరలో నిధులు విడుదల అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే నియోజకవర్గంలో ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హొళగుంద, హాలహర్వి మార్కెట్ యార్డు నిధులతో 80 కిలో మీటర్ల మేర 15 రోడ్ల పనులు రూ.7.78 కోట్లు నిధులు వెచ్చించి 70 శాతం ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు నిర్మిస్తున్నారు. 10 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని ఆలూరు-హొళగుంద రహదారి మరమ్మతులకు రూ.2.56 కోట్ల మార్కెట్ యార్డ్ నిధులు ఖర్చు చేస్తున్నారు. దాదాపు 26 కిలో మీటర్ల పొడవున గుంతలను పూడ్చి, బీటీ రోడ్డు వేస్తున్నారు.

రూ.2.56 కోట్ల మార్కెట్ యార్డ్ నిధులతో

ఆలూరు-హొళగుంద మండలాల మధ్య రహదారి పొడవు 26 కిలో మీటర్లు. కంకర తేలి, గుంతలు పడ్డ ర హదారిలో ప్రయాణించాలంటే గంటకు పైగా సమయం పట్టేది. ఇది ఆంధ్ర-కర్ణాటక రాష్ట్రాలను అనుసంధానం చేసే రహదారుల్లో ఒకటి. అలాగే ఎల్లార్తి పుణ్యక్షేత్రమైన షేక్షావలి దర్గాకు వేలాది మంది భక్తులు వచ్చి వెళ్తుంటారు. గత ప్రభుత్వం హయాంలో ఈ రహదారి నిర్మాణానికి గత పాలకులు పట్టించుకోలేదు. గుంతల రహదారిలో ప్రయాణించి చాలా మంది ప్రమాదాల బారిన పడ్డారు. గత నెల క్రితం నుంచి రూ.6 కోట్ల మార్కెట్ యార్డ్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు చకచక సాగుతున్నాయి. ప్రస్తుతం 2.56 కోట్లతో ఆలూరు నుంచి ముద్దన గేరి వరకు ఎల్లార్తి నుంచి చిన్న హ్యాట గ్రామం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. మరో రూ.4 కోట్లతో మిగిలిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు పీఆర్ అధికారులు తెలిపారు.

ఇబ్బందులు తొలిగాయి



గతంలో సరైన రోడ్లు లేకపోవడంతో ఇబ్బంది పడేవాళ్లం. వర్షాకాలంలో ఇబ్బందులు మరీ తీవ్రంగా ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం మా గ్రామం మీదుగా బీటీ రోడ్డు వేయడంతో ప్రయాణ కష్టాలు తీరాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో రోడ్లు బాగుపడ్డాయి. ప్రయాణికుల ఇబ్బందులు తొలిగిపోయాయి.

– సుధాకర్, ముద్దనగేరి గ్రామ సర్పంచ్

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం. టీడీపీ ప్రభుత్వం హయాంలో దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి శూన్యం. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రామీణ రోడ్లు, ప్రధాన రహదారుల రూపురేఖలు మారిపోయాయి. నియోజకవర్గంలోని 5 మండలాల్లోని 15 రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రూ.7.78 కోట్లతో పనులు జరుగుతున్నాయి. అలాగే గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కింద సచివాలయానికి రూ.20 లక్షలతో గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి.

– గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి

ఇంటి వద్దకే వైద్యసేవలు



ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శ్రీలక్ష్మి

మద్దికెర: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా తాము ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారులు నగేష్, శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక సాయినగర్ కాలనీలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా, సిబ్బంది ప్రకాష్‌రావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

వెల్దుర్తి: మండల వ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. మండల పరిధిలోని పలు సచివాలయాల పరిధిలోని కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు తమకు కేటాయించిన ఇళ్లలో కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి సచివాలయం 3 పరిధిలోని ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని బొమ్మన రవిరెడ్డి తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తప్పవు

ఆలూరు: మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో సర్వేనంబర్ 179–ఏలోని చర్చీ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తప్పవని తహసీల్దార్ విజయ్‌కుమార్ హెచ్చరించారు. స్థలం ఆక్రమణపై రెండు రోజుల క్రితం గ్రామస్తుల నుంచి ఫిర్యాదు అందిందన్నారు.దీనిపై విచారణకు ఆదేశించగా ఆర్ఓఆర్, అసైన్డు భూమిగా తేలిందని తహసీల్దార్ తెలిపారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్

కృష్ణగిరి: మండల పరిధిలోని అమకతాడు గ్రామంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 29న వీరబ్రహ్మ సుప్రభాతం, వేద పారాయణం, కుంకుమార్చన, రాత్రి 8గంటలకు గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణం ఉంటుందన్నారు. 30న గురుపూజ, హోమాలు, సాయంత్రం 4 గంటలకు నందికోల ప్రభోత్సవం, ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు ఉంటుంది. మే 1న సుప్రభాతసేవ, వేదపారాయణం, పూజ కార్యక్రమాలు జరుగుతాయని వారు తెలియజేశారు. ఇదే రోజు పాలపళ్ల ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ. 30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలను అందించనున్నట్లు తెలిపారు. సాయంత్రం పరుగుపందెం ఉంటుందని, ప్రథమ, ద్వితీయ బహుమతులు కింద 3, 2 తులాల వెండి పథకాలను అందించనున్నట్లు వారు తెలిపారు. 2న న్యూ క్యాటగిరి విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నారు. దాతల సహకారంతో రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు చొప్పున అందజేస్తున్నట్లు తెలిపారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండండి



నెరణికి తండాలో చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ శేఖర్

ఆలూరు రూరల్: డయేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ శేఖర్ సూచించారు. గత మూడు రోజుల క్రితం నెరణికి, నెరణికి తండా గ్రామాలకు చెందిన 20 మంది రోగులు విరేచనాలు, వాంతులతో ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. దీంతో అప్రమత్తమైన వైద్యాధికారులు ఆ గ్రామాల్లో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం నెరణికి తండాలో డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలకు తిరగరాదన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటి తాగాలని, వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. రోజుకు 5 లీటర్ల నీటిని తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

పట్టణాభివృద్ధికి కృషి చేయాలి

- మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు




సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రఘు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్నడు లేనంతగా పట్టణంలో ఇటీవల 108మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో వాగులు, వంకలు పొంగిపొర్లి పట్టణ వాసులు ఇబ్బందులు పడ్డారని, దీన్ని దృష్టిలో పెట్టుకొని మునుముందు జరుగకుండా పట్టణాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధికారులను సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. భారీ వర్షాలతో పట్టణంలోని అన్ని వార్డుల్లోని ప్రజలు వర్షపు నీటితో ఇబ్బందులు పడ్డారని సభ్యులు ముక్తకంఠంతో పేర్కొన్నారు. స్పందించిన కమిషనర్ గంగిరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని ధోబీ ఘాట్ వద్ద ఉన్న వంకతో పాటు అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఎంఎస్ నగర్ సమీపం వరకు వంకల్లో పూడిక, అడ్డులను తొలగించామన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి అజెండాలోని 24 అంశాలతో పాటు టేబుల్ అజెండాలో పొందుపరిచిన అభివృద్ధి పనులకు సమావేశంలో కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. 21వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణాలు చేపట్టాలని విపక్ష కౌన్సిలర్ దయాసాగర్ చైర్మన్ దృష్టికి తీసుకొని చర్యలు తీసుకొంటామని కమిషనర్ సమాధానం ఇచ్చారు. కాగా 14వ వార్డు పరిధిలోని తమ అనుమతి లేకుండా తమ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని 2వ వార్డు కౌన్సిలర్ అంపమ్మ పేర్కొనడంతో డాక్యుమెంట్లు తమకు సమర్పిస్తే పరిశీలించి చర్యలు తీసుకొంటామని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా గాంధీ నగర్‌లోను,శివన్న నగర్‌లో రోడ్లు, స్పీడ్‌బ్రేకర్ల నిర్మాణాలు, మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణాలు చేపట్టాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు డిష్‌కేశవరెడ్డి, అమానుల్లా, శివప్రసాద్, రాజారత్నం, ఖాశింబేగ్, ఇషాక్‌లు కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు నజీర్‌అహమ్మద్, దివ్యకళ, డీఈ, మనోహర్‌రెడ్డి, ఏఈ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కో ఆప్షన్‌మెంబరు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు

- జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ



ముగతి ఫారం దగ్గర ఉన్న విత్తన పరిశోధన కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేడీఏ వరలక్ష్మీ

ఎమ్మిగనూరురూరల్: రైతు భరోసా కేంద్రాల ద్వారా వంద శాతం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ పరికరాలు అందేల చూడాలని జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ముగతి ఫారం దగ్గర ఉన్న విత్తన పరిశోధన కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే స్థానిక సీడ్స్ విత్తనాలు విక్రయించే దుకణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ఈ ఖరీఫ్ సీజన్‌లో గతంలో కంటే ఎరువులు రైతులకు అందేల చూడాలని చెప్పారు. గత ఖరీఫ్‌లో 14 వేల టన్నుల ఎరువులను ఆర్‌బీకెల ద్వారా రైతులకు అందిస్తే ప్రస్తుతం 80 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతుల ఆధార్ వివరాలు, ఫోన్ నంబర్‌ను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం ఆర్‌బీకెల ద్వారా రైతులకు చేరాలని చెప్పారు. ఈ– క్రాప్ బుకింగ్, ఈకేవైసీని తప్పనిసరిగా చేయిస్తే వారికి వచ్చే సంక్షేమ పథకాలు రైతులకు అందుతాయని తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని జేడీఏ వరలక్ష్మీ పేర్కొన్నారు. స్థానిక సీడ్స్ విత్తనాల దుకాణాల కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ విత్తనాలను విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే విత్తనాలను విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి వస్తే చర్యలు తప్పవని చెప్పారు. జేడీఏతో పాటు ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో మహేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం డీలర్స్ సమావేశానికి జేడీఏ హాజరయ్యారు.

పేదలకు దేవుడిచ్చిన వరం సీఎం జగన్

- ప్రజా సేవే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యం
- పక్షపాతం లేకుండా ఇంటింటికీ పథకాల చేరవేత
- ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



బాపనదొడ్డి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి

కృష్ణగిరి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పేదలకు దేవుడిచ్చిన వరమని, పక్షపాత వైఖరి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను మీ ఇంటికీ అందిస్తోందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పేర్కొన్నారు. కృష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని బాపనదొడ్డి గ్రామంలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణితో కలిసి ఎమ్మెల్యే ×గడపగడపకు మన ప్రభుత్వం॰ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి ప్రజలు గజమాలతో స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింకీ తిరుగుతూ రైతులు, వృద్ధులు, అక్కచెల్లెమ్మలు, యువతతో మాట్లాడారు. అవ్వా..తాతా పింఛన్ వస్తోందా.. ఆరోగ్యం బాగుందా.. వైఎస్సార్ ఆసారా, చేయూత, అమ్మ ఒడి డబ్బులు పడ్డాయా అంటూ ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నారు. మండలస్థాయి అధికారులతో కలిసి మీ ముందుకు వచ్చానని, ఏవైనా సమస్యలుంటే తెలపాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్నా పథకాల్లో ప్రతి కుటుంబానికి ఏదో ఒక లబ్ధి చేకూరుతోందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో పేదల అన్యాయం చేశారని విమర్శించారు. టీడీపీ నేతల కుటిల రాజకీయాలతో అర్హులకు అన్యాయం చేయారని దుయ్యబట్టారు. నవరత్నాల రూపంలో ప్రతి ఇంటికీ లక్షలాది రుపాయల మేర లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. టీడీపీ మాయంలో నీరు చెట్టు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లు.. ఇలా ప్రతి పథకంలో తెలుగు తమ్ముళ్లు కోట్లాది రుపాయలు కొల్లగొట్టారని, దీంతో ఆ పార్టీకి కాలం చెల్లిందన్నారు. గడిచిన నాలుగేళ్లలో ప్రజలకు చెప్పినవి, చెప్పనివి కూడా అమలు చేసి ఘనత జగనన్నేకే దక్కిందన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలు

కొన్ని కాలనీలకు తాగునీరు రావడం లేదని, అలాగే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, సీసీ రహదారులు వేయాలని పలువురు మహిళలకు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. అలాగే కొందరు అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలు విన్నవించగా స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పత్తికొండ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మాదవరావు, కృష్ణగిరి సొసైటీ చైర్మన్ బ్రహ్మానందరెడ్డి, పార్టీ మండల, యూత్ కన్వీనర్లు ఆర్‌బీ వెంకటరాముడు, లక్ష్మీకాంతరెడ్డి, శిగరమాను కృష్ణమూర్తి, శ్రీనాథ్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి, శ్రీరాములు, ప్రసాద్, బార ఈశ్వరయ్య, నాగేంద్ర, మద్ది, కురువ వెంకటేష్, సుధకార్‌రెడ్డి, అంజినప్ప, మాదులు, నాగరాజు, జయరామిరెడ్డి, ధనుంజయ, బాలు, నారాయణ, ట్రాన్స్‌కో డీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఓ వెంకటేశ్వర్లు, పీఆర్, ఆర్‌డబ్ల్యూస్, ట్రాన్స్‌కో ఏఈలు అబ్దుల్‌వహీద్, హరి, మద్దిలేటి,ఏపీఎం దాసన్న, ఏపీఓ అబ్దుల్‌షుకూర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రెండు రోజుల క్రితం కృష్ణగిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్‌యాదవ్ తండ్రి గోమసాని కృష్ణమూర్తి అనారగ్యోంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పరామర్శించారు. మీ కుటుంబానికి పార్టీతోపాటు తమ కుటుంబం ఏళ్లవేళలా అండగా ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, గ్రామ నాయకులు ఉన్నారు.

బురుజులలో 'జగనన్నే మా భవిష్యత్తు'

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామంలో శుక్రవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు సుబ్బ య్య, నాయకులు జయభరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుళాయినీటిని వేడి చేసి వడబోసి తాగాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సరఫరా అవుతున్న మంచినీటి కుళాయి నీటిని ప్రజలు వేడిచేసి వడబోసి తాగాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి శుక్రవారం ప్రజలకు సూచించారు. భారీ వర్షాలతో వర్షపు నీరు గుడికల్ చెరువు, టీబీపీ ఎల్లెల్సీ ద్వారా ఎస్ఎస్‌ట్యాంక్‌లో కలుస్తోందని, దీంతో నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు నీటిని కాచి వడబోసి తాగితే వ్యాధులు దరి చేరవన్నారు.

ఏవైనా సమస్యలుంటే తెలియజేయండి



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే శ్రీదేవి

వెల్దుర్తి: నియోజకవర్గంలో ఏవైనా సమస్యలుంటే ప్రజలు నేరుగా తనను కలిసి తెలియజేసి పరిష్కారం పొందవచ్చునని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తాను రెండు మండలాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు.

సాగు పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

ఎమ్మిగనూరురూరల్: రైతులు సూక్ష్మ నీటి సాగు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సూక్ష్మ నీటి సాగు పథకం ప్రాజెక్ట్ అధికారిణి ఉమాదేవి, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాల రైతు భరోసా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు డ్రిప్‌పై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూక్ష్మ బిందు సేద్యంపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 5 వేల హెక్టార్లలో బిందు సేద్యం చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ విధానం ద్వారా పంటలకు సాగునీరు ఆదా అవుతుందని చెప్పారు. అలాగే అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సంబంధించిన అన్ని వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు అందుబాటులో పెడుతున్నట్లు చెప్పారు. శిక్షణలో జిల్లా ఉద్యానశాఖ అధికారి రామాంజనేయులు, ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో మహేశ్వరరెడ్డి, ఎమ్మిగనూరు డివిజన్ ఉద్యానశాఖ అధికారిణా శ్రీవాణి, ఆర్‌బీకెల వీఏఏ, వీహెచ్ఏ, ఎంపీఈవోఎస్‌లు, డ్రిప్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు పరిష్కారం



స్టోన్‌ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న వేణుసూర్య

నందవరం : జగనన్న భూ హక్కు– భూ రక్ష పథకంలో భాగంగా చేస్తున్న సమగ్ర భూ రీసర్వేతో భూ వివాదాలు తొలగిపోతాయని ఆదోని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాచాపురం, ఇబ్రహీంపురంలో స్టోన్ ప్లాంటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులకు ఇబ్బందులు లేకుండా సర్వే చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా సర్వే చేయించడమే కాక భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ అమీన బేగం, మండల సర్వేయర్ అబ్బర్‌బాషా, సర్వేయర్లు శేఖర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.